సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



'ఆడుదాం' ఆంధ్రా ఆణిముత్యాలు
ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలుగులోకి తీసే ప్రతిష్టాత్మక 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో భాగంగా. టాలెంట్ హంట్‌లో జిల్లా క్రీడా కారులకు అవకాశం లభించింది. -8లో



భూసార పరీక్షలు లాభదాయకం
పొలాలలో భూసార పరీక్షలు నిర్వహించడం రైతులకు లాభదాయకమని ఆత్మ పీడీ విజయ లక్ష్మి తెలిపారు. భుసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.220
రెండోరకం	రూ.80	రూ.158

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 109 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు దైవ సేవకుల సదస్సు

కడప కార్పొరేషన్: వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఉన్న దైవ సేవకులకు ఈనెల 14వ తేదీ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ క్రిస్టియన్ మైనార్టీ సిటీ ప్రెసిడెంట్ ఎస్. విజయ్ కిషోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ సునీల్, నగర ప్రధాన కార్యదర్శి పాస్టర్ బి.జాన్, కన్వీనర్ సీహెచ్ మనోహర్ బాబు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్థానిక మేడా ఫంక్షన్ హాలులో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా అంతర్జాతీయ సువార్తికురాలు డా. వైఎస్ విమలారెడ్డి హాజరై ప్రసంగిస్తారన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని దైవ సేవకులంతా ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న డీఏఓ చంద్రనాయక్

రాజంపేట రూరల్: పంట సాగు చేసే ప్రతి రైతు ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు(డీఏఓ) చంద్రనాయక్ తెలియజేశారు. మండల పరిధిలోని పులపుత్తూరులోని రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను ఆలకించారు. వారికి తగు సూచనలు,సలహాలు ఇచ్చారు. అనంతరం బ్యాంక్ ఆఫ్ సీడ్స్ విత్తనాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఏడీఏ జీ రమేష్‌బాబు ఉన్నారు.

టంగుటూరులో నూతన ఇసుక రీచ్

నందలూరు(రాజంపేట): మండలంలోని టంగుటూరు వద్దగల బహుదానదిలో ఇసుక రీచ్ ఏర్పాటు కోసం కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మంగళవారం సాయంత్రం స్థల పరిశీలన చేశారు. ఈ నేపథ్యంలో ఆయన రీచ్ ఏర్పాటు కోసం చూపిన స్థల వివరాలను రెవెన్యూ, మైన్స్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఆర్డీఓ మోహన్ రావు, మైన్స్ ఏడీ రవిప్రసాద్, డీటీ మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

మదనపల్లె-2 ఆర్టీసీ డిపో మేనేజర్ సస్పెన్షన్

మదనపల్లె సిటీ: శబరిమల ఆర్టీసీ బస్సు అద్దె వసూళ్ల చెల్లింపుల్లో నిర్లక్ష్యం కనబరిచినందుకు మదనపల్లె ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సి నిరంజన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రఘునాథ్‌లను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ అన్నమయ్య జిల్లా ప్రజారవాణాధికారి రాము ఉత్తర్వులు జారీ చేశారు. డీపీటీఓ మాట్లాడుతూ మదనపల్లె-2 డిపో నుంచి అయ్యప్పస్వాములు ఆర్టీసీ బస్సును అద్దె ప్రతిపాదికన తీసుకెళ్లి తిరిగి వచ్చిన తరువాత వాటికి సంబంధించిన డబ్బులను సంస్థకు చెల్లించకుండా కొద్ది రోజులు సొంత అవసరాలకు వాడుకున్నట్లు తాము గుర్తించామన్నారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చాక విచారణ జరిపితే మరుసటి రోజు డబ్బులు సంస్థకు చెల్లించారని తెలిపారు. సస్పెండైన డీఎం స్థానంలో వన్ డీఎం మూరే వెంకటరమణారెడ్డిని ఇన్‌చార్జ్‌గా కొనసాగనున్నట్లు తెలిపారు.

వైద్య సేవలు సూపర్

- కడప రిమ్స్‌లో అందుబాటులోకి మెడికల్‌లో ఐదు, సర్జికల్‌లో 6 విభాగాల సేవలు
- ప్రస్తుతం ఐదు విభాగాల్లో ఓపీ సేవలు
- ప్రతి రోజూ 50 నుంచి 60 మందికి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- ఈనెలాఖరులోపు విభాగాలన్నింటిలోనూ ..ఓపీ వైద్య సేవలు
- మార్చి నెలాఖరుకల్లా ఐపీలోనూ 452 పడకల మేరకు సంపూర్ణ వైద్యం



కడప రిమ్స్ ఆవరణలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవనాలు

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) రాయలసీమ జిల్లాలకే తలమానికంగా నిలువనుంది. ఇప్పటికే రిమ్స్‌లో 175 ఎంబీబీఎస్ (వైద్య విద్య) సీట్లతో అలరారుతోంది. 2006-07 నుంచి వైద్య విద్యను అందిస్తున్న రిమ్స్ 2012లో పీజీ హోదా పొందింది. ఇదే రిమ్స్ ఆవరణలో 2009 జనవరిలో 100 సీట్లతో ప్రభుత్వ దంత వైద్య కళాశాలను డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ మరణానంతరం 2009 నుంచి 2019 దాకా కడప రిమ్స్ అభివృద్ధిలో మరో అడుగు ముందుకు వేయలేదు. 2019లో వైఎస్‌ఆర్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప ప్రభుత్వ సర్వజన వైద్యశాల (రిమ్స్)ను సర్వతోముఖాభివృద్ధి చేయాలనే దృఢసంకల్పంతో ముందుకు కదిలారు. ఇందులో భాగంగా ఇదే ఆవరణంలో మూడు రకాల హాస్పిటల్స్ నిర్మాణానికి 2019 డిసెంబర్ 23న శంకుస్థాపన చేశారు. కరోనా విలయతాండవం చేయడంతో నిర్మాణాలు కాస్త ఆలస్యమైనా కడప రిమ్స్ ఆవరణలో రూ.40.81 కోట్లతో 100 పడకల సామర్థ్యంతో మానసిక వైద్యశాల, రూ.107 కోట్లతో 100 పడకల కేన్సర్ హాస్పిటల్, 452 పడకల సామర్థ్యంతో రూ.125 కోట్ల వ్యయంతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మొత్తం 272.81 కోట్లతో నిర్మాణాలను ఏపీఎంఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్) పూర్తి చేశారు. గత ఏడాది డిసెంబర్ 23న ఈ మూడు హాస్పిటల్స్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు.

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో 11 విభాగాల్లో వైద్య సేవలు...

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో జనరల్ మెడిసిన్‌లో 6 విభాగాలు, సర్జరీలో 5 విభాగాలను 452 పడకల సామర్థ్యంతో సెంట్రల్ ఏసీ విధానంలోకి త్వరలో ఐపీ వైద్య సేవలను ప్రారంభించనున్నారు.

- జనరల్ మెడిసిన్ విభాగంలో కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఎండోక్రైనాలజీ, కార్డియో థొరాసిక్ వ్యాక్యులార్ సర్జన్ (సీటీవీఎస్), ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాలు వున్నాయి. వీటిని మాస్టర్ ఆఫ్ డాక్టరేస్, డైరెక్టరేస్ ఆఫ్ మెడిసిన్ (ఎం.డి, డిఎం)లో నిష్ణాతులైన వారు పర్యవేక్షిస్తారు.
- జనరల్ సర్జరీ విభాగాలలో న్యూరోసర్జరీ,యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీలలో వైద్య సేవలను అందించనున్నారు. వీటిని మాస్టర్ ఆఫ్ సర్జరీ, మాస్టర్ ఆఫ్ థెరపీ (ఎంఎస్, ఎంసీహెచ్)లు పర్యవేక్షిస్తారు.
- వివిధ విభాగాల వారు ఈసీజీ, 2డి ఎకో, టిఎండి, ఆంజియోగ్రామ్, సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్, డయాలసిస్, ఎండోస్కోపి, కొలనోస్కోపి, ఈఆర్‌సీపి, డయాబెటిక్ పరీక్షలు, థయార్డ్ (థైరాయిడ్ ప్రొఫైల్), రేడియాలజీ, అనస్తీషియా విభాగాలు ప్రత్యేకంగా వైద్య సేవలను అందించనున్నారు.
- ఐపీ విభాగంలో మొత్తం 452 అధునాతన సౌకర్యాలు, ఆక్సీ పడకలు ఏర్పాటు చేస్తారు. 10 ల్యాబినార్ ఆపరేషన్ థియేటర్లు ఉంటాయి. 100 పడకలు ఐసీయూ విభాగాలుగా ఉంటాయి. క్యాజువాలిటీ 12 పడకలు, 20 పడకలు పేయింగ్ రూమ్స్. ఆపరేషన్‌కు ముందు, ఆపరేషన్ వైద్య సేవలు పొందే విధంగా ఐదు విభాగాల్లో 320 పడకలను ఏర్పాటు చేశారు.
- ప్రతి విభాగంలోనూ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు 3 నుంచి 5 మందితో పాటు, 140 మంది స్టాఫ్ నర్సులు, పరిపాలన విభాగం అధికారులు, ఇతర వైద్య సిబ్బంది ఉంటారు.
- ప్రస్తుతం నిర్వహించబడుతున్న ఓపి సేవలను క్రింది విధంగా డాక్టర్లు వైద్య సేవలను అందిస్తున్నారు.
- ఆయా విభాగాల్లో ఓపి సేవలను వచ్చిన వారికి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ 60 నుంచి 70మంది రోగులు వివిధ రకాల స్పెషాలిటీ సేవలను పొందుతున్నారు. వీరికి అవసరమైన మందులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫార్మసీ ద్వారా ఉచితంగా ఇస్తున్నారు.
- ఈనెలాఖరులోపు పూర్తి స్థాయిలో ఓపి వైద్య సేవలు... మార్చి నెలాఖరుకల్లా పూర్తి స్థాయిలో ఐపీ సేవలను అందించనున్నారు.
- ఓపీ విభాగానికి వస్తున్న రోగులలో కడప రిమ్స్‌లో వైద్య సేవలను అత్యుత్తమంగా అందిస్తున్నారనీ వారి అభిప్రాయాల ద్వారా తెలియజేశారు.

వైద్యుడి పేరు	విభాగం	వైద్యసేవలు
డాక్టర్ ఎస్.ఆర్.రాజశేఖర్‌రెడ్డి	కార్డియాలజీ	గుండె జబ్బులు
డాక్టర్ శ్రీదీప్ సిద్దవరం	యూరాలజీ	మూత్రపిండ వ్యాధులు
డాక్టర్ మోహన్ సిద్దార్థ్	న్యూరోసర్జరీ	నరాలకు సంబంధిత వ్యాధులు
డాక్టర్ సతీష్‌రెడ్డి	నెఫ్రాలజీ	మూత్ర పిండ వ్యాధులు
డాక్టర్ సుకుమార్	పీడియాట్రిక్ సర్జరీ	12 సం.లోపు పిల్లలకు వైద్యం
డాక్టర్ కృష్ణ కార్తీక్	మెడికల్ గ్యాస్ట్రో	గ్యాస్ట్రిక్ వ్యాధుల చికిత్స
డాక్టర్ నారాయణ రెడ్డి	సర్జికల్ గ్యాస్ట్రో	గ్యాస్ట్రిక్ వ్యాధుల చికిత్స
డాక్టర్ కె. శ్యాం	ప్లాస్టిక్ సర్జరీ	శస్త్ర చికిత్సల ప్రత్యేక విభాగం



గుండె జబ్బుతో బాధపడుతున్న రోగిని పరీక్షిస్తున్న కార్డియాలజిస్ట్ రాజశేఖర్‌రెడ్డి

అన్ని మందులు ఉచితంగా ఇచ్చారు



నా వయసు 60 ఏళ్లు. నేను కొన్నేళ్లుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాను. ఇప్పటికే నాకు రెండు స్టంట్‌లు వేశారు. వైద్య పరీక్షల కోసం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు వచ్చాను. రాగానే ఓపి చీటీ ఇచ్చి గుండె జబ్బులను చూసే డాక్టర్ దగ్గరికి తీసుకుని వెళ్లారు. ఆయన పరీక్షలు చేసి గుండె కొద్దిగా నెమ్మదిగా కొట్టుకుంటోందనీ, మందులను వాడాలనీ చెప్పారు. మందులను ఉచితంగా ఇచ్చారు. -కదిరయ్య, శిబ్యాల, రాయచోటి, అన్నమయ్య జిల్లా

వ్యయ ప్రయాసాలు తగ్గాయి..



కడప రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ విభాగంలో గుండె జబ్బులకు సంబంధించిన వైద్యం చేస్తున్నారనీ తెలుసుకుని ఇక్కడికి వచ్చాను. డాక్టర్ వద్దకు వెళ్లగానే 2డీ ఎకో పరీక్షలు చేశారు. గతంలో కర్నూలు, తిరుపతి, హైదరాబాద్‌కు వెళ్లి చూపించుకుని వచ్చాను. అక్కడికి వెళ్లాలంటే కుటుంబసభ్యుల తోడుతో పాటు, అనేక వ్యయప్రయాసలు ఉండేవి. -చంద్రశేఖర్ రెడ్డి, మాధవరం-1, ఒంటిమిట్ట

సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు



మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జిల్లా ప్రజలకు రిమ్స్ రూపంలో వైద్య వరాన్ని అందిస్తే, ఆయన తనయుడు వైఎస్ జగన్ మరో మూడు రకాల ప్రత్యేక వైద్యశాలలను నిర్మించడం అభినందనీయం. జిల్లా ప్రజల తరపున, వైద్యులు, వైద్య సిబ్బంది తరపున సీఎంకు ధన్యవాదాలు. ఈనెలాఖరులోపు అన్ని విభాగాలలో ఓపి సేవలను, మార్చి నుంచి ఐపీ సేవలను అందించనున్నాం. -డాక్టర్ సురేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కడప రిమ్స్

రాముని సేవలో హనుమ



హనుమ వాహనంపై స్వామి వారు

కడప కల్చరల్: తన ప్రభువు, లోక పాలకుడు శ్రీరామచంద్రుడు కార్యర్థమై తనను సేవకుడిగా ఎంచుకున్నందుకు హనుమ పులకించిపోయాడు. ఆ సేవ అదృష్టంగా భావించి శ్రీరాముడికి వాహనమై స్వామి తరించాడు. కోదండపాణిగా రాముడు వనవిహారం చేసేందుకు సహకరించాడు. దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి ఉదయం కల్పవృక్ష వాహనంపై శ్రీకృష్ణునిగా కొలువుదీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్షం వాహనంపై స్వామి ఊరేగింపు ఏర్పాటు చేయడంతో తిలకించేందుకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం హనుమంత వాహనంపై కోదండరాముడిగా కొలువుదీరాడు. వేద పండితులు స్వామి అమ్మవార్ల మూల విరాట్లకు విశేష అలంకారం చేశారు. అనంతరం ఆలయం వెలుపలగల అలంకారం మండపంలో స్వామిని వాహనంపై ఆసీనులను చేశారు. సూర్యతేజోమయుడైన శ్రీ రామచంద్రుడు ధగధగలాడే రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులో మరింతగా మెరిసిపోతూ భక్తులను కరుణించాడు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ అభిషిక్త్ కిషోర్
- ఎలాంటి పక్షపాతం, జాప్యం లేకుండా విచారణ చేస్తాం: ఎస్పీ కృష్ణారావు



జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పీ కృష్ణారావు

రాయచోటి: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టిసారించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ బి. కృష్ణారావు, డీఆర్‌ఓ సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నమోదైన కేసుల్లో జాప్యాన్ని నివారించి సత్వర న్యాయం అందించాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో భాగంగా సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. 2023 నవంబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేది వరకు జిల్లాలో మొత్తంగా 15 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు అయి విచారణ దశలో ఉన్నాయన్నారు. వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా పోలీసులతోపాటు సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. కేసులలో ఎప్పటికప్పుడు చార్జిషీట్ దాఖలు చేయడంతో పాటు నిర్ణీత సమయంలోగా కేసులను పూర్తి చేయాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో ప్రతినెల క్రమం తప్పకుండా సివిల్ రైట్స్ డే నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రాలను సంబంధిత తహశీల్దార్లు వెంటనే జారీ చేసేలా పర్యవేక్షించాలని ఆర్డీఓలకు సూచించారు. జిల్లా ఎస్పీ బి కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి ఎలాంటి పక్షపాతం, జాప్యం లేకుండా విచారణ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన సమాచారాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సభ్యులను కోరారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రగతి, ఆయా అంశాలలో తీసుకున్న చర్యలపై డీవీఎంసీ సభ్యులు అడిగిన సందేహాలకు కలెక్టర్, ఎస్పీలు సందేహ నివృత్తి చేశారు. ఈ సమీక్షలో రాజంపేట ఆర్డీఓ మోహన్ రావు, డీఎస్పీలు మహబూబ్ బాష, కేశప్ప, వి.ఎస్.కే చైతన్య, ఆంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి జాకీర్ హుస్సేన్, బీసీ సంక్షేమశాఖ అధికారి సందప్ప, న్యాయశాఖ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జిల్లా నిఘా పర్యవేక్షణ కమీటీ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం తగదు

రాయచోటి: ఎన్నికల విధులలో అలసత్వం ఉండరాదని, స్పందన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం ఇవ్వాలని కులగణనను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. మంళవారం సాయంత్రం స్థానిక రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో స్పందన, సాధారణ ఎన్నికలు, హౌసింగ్, కులగణన, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, రీసర్వే తదితర అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఓటర్ల తుది జాబితాలో ఏవైనా తప్పులుంటే వెంటనే సరిదిద్దాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తూ.. హౌసింగ్ కాలనీలలో ఇళ్ల నిర్మాణం కోసం అడ్వాన్స్ తీసుకున్న వారికి త్వరితగతిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహిద్దాం

రాయచోటి: రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకుందామని ఎస్పీ బి.కృష్ణారావు జిల్లా పోలీస్ యంత్రాంగానికి సూచించారు. మంగళవారం రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలీసు అధికారులతో ట్రెనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ ఎన్నికల వేళ ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేలా ప్రజలకు నమ్మకాన్ని కలిగించాలని చెప్పారు. వాహనాల తనిఖీల గురించి అధికారులను ఆదేశించారు. బయట రాష్ట్రాలు, జిల్లా నుంచి అక్రమ మద్యం, డబ్బులు రవాణాను రానివ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ట్రెనింగ్ ప్రోగ్రాంలో అదనపు జిల్లా ఎస్పీ విబి రాజ్‌కమల్, జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి భరోసా

- సరికొత్త ఫీచర్లతో ఆరోగ్యశ్రీ కార్డులను అందిస్తున్న ప్రభుత్వం
- అన్నమయ్య జిల్లాలో 54 శాతం మందికి పంపిణీ
- జిల్లాకు చేరిన 2.7 లక్షల కార్డులు



జిల్లాకు చేరిన నూతన ఆరోగ్యశ్రీ కార్డులు

రాయచోటి: ప్రజలందరికీ మంచి ఆరోగ్యాన్ని అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం సరికొత్త ఆరోగ్య శ్రీ కార్డులను అందిస్తోంది. విస్తరించిన ప్రయోజనాలు, సరికొత్త ఫీచర్లతో కూడిన వీటి పంపిణీ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా సాగుతోంది. ఇప్పటికే 54 శాతం మంది లబ్ధిదారులకు కార్డులు అందాయి. రూ.5 లక్షల్లోపు వార్షికాదాయం కలిగిన 4,44,664 లక్షల కుటుంబాలు ప్రస్తుతం ఆరోగ్య శ్రీ పరిధిలోకి వస్తున్నాయి. వీరికి నూతన కార్డుల పంపిణీ గత డిసెంబర్ నెల నుంచి ప్రారంభమైంది.ప్రభుత్వం ఇప్పటి వరకు 2,79,743 లక్షల కుటుంబాలకు కార్డులు పంపిణీ చేసేందుకు జిల్లాకు చేరవేసింది. వీటిని ఆయా మండలాల పరిధిలోని ఎంపీడీవోలకు అందజేసింది. నేటి వరకు 1,41,795 లక్షల కార్డులను లబ్ధిదారులకు ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వలంటీర్ల సాయంతో అందజేశారు. దీంతో ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ జిల్లాలో 54 శాతానికి చేరినట్లు జిల్లా ఆరోగ్య శ్రీ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ లోకవర్ధన్ తెలిపారు. మిగిలిన కార్డులను కూడా త్వరితగతిన అందించేందుకు అధికారులు, సిబ్బంది కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. కొత్త కార్డులు అందజేయడంతో పాటు పథకం కింద ఉచితంగా పొందే వైద్య సేవలు, వాటిని ఎలా పొందాలో కూడా అవగాహనను కల్పిస్తున్నామన్నారు.

- గత టిడిపి ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసింది. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ పథకానికి ఊపిరి పోశారు. గతంలో తెల్లరేషన్ కార్డుదారులకు మాత్రమే పథకం పరిధిలోకి వస్తుండగా రూ.5 లక్షల్లోపు వార్షికాదాయం ఉన్న మధ్య తరగతి ప్రజలను భాగస్వాములను చేశారు. అంతేకాకుండా పథకం కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారు. వందలాది చికిత్సలను ఇందులో చేర్చారు. ఈ తరహా ప్రయోజనాల అన్నింటితో కూడిన కార్డులను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు పంపిణీ చేస్తోంది.


సిటిజన్ యాప్‌పై అవగాహన...

కార్డుల పంపిణీ సమయంలోనే ప్రతి కుటుంబానికి పథకం సేవలను సులువుగా ఎలా పొందాలో వివరిస్తూ బ్రోచర్‌ను అందజేస్తున్నారు. పథకం సమగ్ర సమాచారం ఈ బ్రోచర్‌లో ఉంది. ఇది ప్రజలకు ఒక గైడ్‌లా ఉపయోగపడుతుంది. అంతే కాకుండా లబ్ధిదారుల మొబైల్ ఫోన్లలో ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయిస్తున్నారు. అందులో లాగిన్ అయి ఎలా వినియోగించాలో అవగాహన కల్పిస్తున్నారు. వైద్య సేవలు, రాష్ట్రం వెలుపల ఉండే నెట్‌వర్క్ ఆసుపత్రులు, వాటిల్లో ఏ ప్రొసిజర్స్‌కు వైద్యం చేస్తారనే సమాచారాన్ని యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. తాము ఉంటున్న ప్రాంతానికి చేరువలో ఏ ఆసుపత్రి ఉందో కూడా తెలుసుకోవచ్చు. అక్కడికు చేరుకోవడానికి జీపీఆర్ఎస్ సౌకర్యం కూడా ఉంది. ఇక గతంలో పథకం ద్వారా పొందిన చికిత్సలు, రిపోర్టులను ఒక్క క్లిక్‌తో పొందడానికి వీలుంటుంది.

కార్డులలో ఉండేవి ఇవే

- కుటుంబ యజమాని పేరు, జిల్లా, మండల, గ్రామ/వార్డు సచివాలయం వివరాలు.
- కుటుంబ సభ్యుల ఫోటోలు, వారి పేర్లు, ఇతర వివరాలు.
- యూనిక్ హెల్త్ ఐడెంటిటీ నంబర్
- క్యూఆర్ కోడ్ (వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లినప్పుడు ఆరోగ్య మిత్ర, వైద్యులు సులువుగా కేస్ రిజిస్ట్రేషన్ చేయడానికి క్యూఆర్ కోడ్ ఉపయోగపడుతుంది.
- దీనివల్ల మరింత వేగంగా, సులభంగా వైద్య సేవలు అందుతాయి.

కడపలో ఆటోడ్రైవర్ నిజాయితీ



ఆటో డ్రైవర్‌కు డ్రెస్‌ను ఇచ్చి అభినందిస్తున్న చిన్నచౌక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ

కడప అర్బన్: ఆటో డ్రైవర్ నిజాయితీ చూపించిన ఘటన మంగళవారం కడపలో చోటు చేసుకుంది. నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటో ఎక్కిన ఓ మహిళ.. తన బ్యాగ్ మర్చిపోయి వెళ్లింది. కాసేపు తర్వాత బ్యాగ్‌ను గుర్తించిన సదరు ఆటో డ్రైవర్ సుబ్రమణ్యం దానిని చిన్నచౌక్‌లో అందజేశారు. ఎస్ఐ మహమ్మద్ రఫీ సదరు మహిళను పిలిపించారు. బ్యాగ్‌ను అప్పగించారు. అందులో వున్న బంగారు ఉంగరం, ఇరత వస్తువులు భద్రంగా ఉన్నాయి. మహిళ, ఆటో డ్రైవర్‌కు రూ. 3 వేలు పారితోషికంగా ఇచ్చింది. ఎస్ఐ సదరు ఆటోడ్రైవర్‌ను అభినందించడంతో పాటు అతని కొడుక్కు డ్రెస్ బహూకరించడం విశేషం.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం: స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఎకనామిక్స్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకనామిక్స్ సబ్జెక్టును బోధించేందుకు అర్హత కలిగి, 55శాతం మార్కులతో, పీహెచ్‌డీ, యూజీసీ నెట్, ఏపీ సెట్ కలిగినవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 17లోపు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

ట్రాక్టర్‌ను ఢీకొన్న బొలేరో వాహనం

– ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని రవీంద్రనగర్ కాలనీ మర్రిమాను పందిళ్లపల్లి రోడ్డు మలుపు వద్ద మంగళవారం రాత్రి నిలబడి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బొలేరో వాహనం ఢీకొనడంతో.. ట్రాక్టర్‌లో కూర్చొని ఉన్న డ్రైవర్ జాలా విజయ్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని మద్దిరేవుల గ్రామం జీఎంఆర్ కాలనీకి చెందిన విజయ్ కుమార్ ట్రాక్టర్‌లో సిమెంటు ఇటుకలు లోడు చేసుకొని స్వగ్రామానికి వెళ్తూ మర్రిచెట్టు మలుపు వద్ద ట్రాక్టర్‌ను ఆపి ఉండగా.. బొలేరో వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్ సీటులో ఉన్న విజయ్ కుమార్ ఒక్కసారిగా రోడ్డుపై పడటంతో బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని 108 సహాయంతో లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టును ఢీకొన్న ట్రాక్టర్

– వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన రామదాసు

బి.కొత్తకోట : ట్రాక్టర్ కల్వర్టును ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మంగళవారం బి.కొత్తకోట–చలిమామిడి మార్గంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి గుమ్మసముద్రం పంచాయతీలోని ఓ వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌కు ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కూలీ పనుల నిమిత్తం బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన రామదాసు (43) పని చేస్తున్నాడు. మంగళవారం బి.కొత్తకోట నుంచి రామదాసు ట్రాక్టర్‌లో సూరప్పగారిపల్లెకు వెళ్తున్నాడు. డేగానిపల్లె దాటుకుని అటవీ ప్రాంతంలో వెళ్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పింది. ఎడమవైపున ఉన్న కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో రామదాసు తల, శరీరంపై గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మణం చెందాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

– మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన శేఖర్

పుల్లంపేట : మండల పరిధిలో ఏపీ మోడల్ స్కూల్ కడప–చెన్నై జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామానికి చెందిన ఎం.శేఖర్ (25), రంగంపల్లి పంచాయతీలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సాయి (20) అనే యువకులు వివాహాలకు క్యాటరింగ్ చేస్తూ జీవనం సాగించేవారు. వారు ఉదయాన్నే ఇంటి వద్ద నుంచి బైక్‌పై రాజంపేటకు బయలుదేరగా పుత్తనవారిపల్లి ఏపీ మోడల్ స్కూల్ సమీపానికి రాగానే.. రాజంపేట నుంచి ఎదురుగా వస్తున్న స్కూటీ ఢీకొనడంతో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా, సాయి తీవ్ర గాయాలపాలయ్యాడు. గాయపడ్డ సాయిని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. పుల్లంపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆడుదాం ఆంధ్రా ఆణిముత్యాలు

- టాలెంట్ హంట్‌లో జిల్లా క్రీడాకారులకు దక్కిన అవకాశం
- పోటీల్లో సత్తా చాటిన మనోళ్లు

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలుగులోకి తీసే ప్రతిష్ఠాత్మక మెగా క్రీడా టోర్నమెంట్ 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో భాగంగా.. నిర్వహించిన టాలెంట్ హంట్‌లో జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులకు అవకాశం లభించింది. జిల్లాకు చెందిన కె.రామ్మోహన్, ఇ.హేమావతిలతోపాటు పులివెందుల జేఎన్‌టీయూలో నాల్గవ సంవత్సరం చదువుతున్న కె.గాయత్రి.. రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన 14 మంది టాలెంట్ ప్లేయర్స్ జాబితాలో చోటు దక్కించుకున్నారు.

కడప స్పోర్ట్స్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు దాదాపు 50 రోజుల పాటు పండుగ వాతావరణంలో పూర్తి చేసుకోగా.. మంగళవారం విశాఖపట్నంలో ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఇప్పటి వరకు ప్రతిభ కనబరిచిన వివిధ క్రీడాకారులను పరిశీలిస్తూ వచ్చిన శాప్ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు, టాలెంట్ హంట్‌లో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 14 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరికి వివిధ అసోసియేషన్లు, సంస్థలు దత్తత తీసుకోగా.. వీరికి ప్రభుత్వం సహకారం అందించి ఉత్తమ శిక్షణ ఇవ్వనుంది. ఇందులో భాగంగా ఖోఖో క్రీడాంశంలో చింతకొమ్మదిన్నె మండలానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికవడం విశేషం. అయితే వీరిరువురూ విద్యాభ్యాసం, శిక్షణ నిమిత్తం ప్రకాశం జిల్లా, బాపట్ల జిల్లాలలో చదువుతుండగా, ఆడుదాం ఆంధ్ర పోటీల్లో ఆయా జిల్లాల నుంచి ప్రాతనిధ్యం వహించి సత్తా చాటారు.


విశాఖపట్నంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కప్ అందుకుంటున్న విద్యార్థిని హేమావతి

ఆల్‌రౌండర్‌గా హేమావతి..



చింతకొమ్మదిన్నె మండలం కొత్తపల్లెకు చెందిన సాధారణ రైతు శివశంకర్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ దంపతుల కుమార్తె అయిన ఇల్లూరు హేమావతి పదో తరగతి వరకు బయనపల్లె ఎస్.వి.హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.పవన్‌కుమార్ వద్ద శిక్షణ పొందింది. ప్రస్తుతం ప్రకాశం జిల్లా కనిగిరిలోని ఎంఎస్‌ఎం డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. కనిగిరిలో ఫిజికల్ డైరెక్టర్ కాశీవిశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ పొందుతోంది. రన్నర్‌గా, ఛేజింగ్‌లో రాణిస్తూ ఆల్‌రౌండర్‌గా నిలుస్తోంది. ఇప్పటికే పలు జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని సత్తాచాటింది. ఆడుదాం ఆంధ్ర పోటీల్లో ప్రకాశం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఈమె జట్టు విజయంలో కీలకభూమిక పోషించి బెస్ట్ ప్లేయర్‌గా నిలిచింది.

రామ్మోహన్.. ఛేజింగ్‌లో ఫస్ట్



చింతకొమ్మదిన్నె మండలం ఆర్.టి.పల్లె గ్రామానికి చెందిన సాధారణ రైతు కూలీ కె.రాముడు, బాలసిద్దమ్మ దంపతులు కుమారుడైన కట్లా రామ్మోహన్ పదో తరగతి వరకు బయనపల్లె ఎస్.వి.హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.పవన్‌కుమార్ వద్ద శిక్షణ పొందాడు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా ఇనకొల్లులోని డీసీఆర్‌ఎం కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకుని, జె.పంగలూరు గ్రామంలోని ఎస్‌ఎస్‌ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ఈయన ఛేజింగ్, రన్నింగ్‌లలో ప్రత్యేకత చాటుతూ ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు. గతంలో పలు సీనియర్ నేషనల్స్‌తోపాటు, ఖోఖో ప్రోలీగ్ పోటీల్లో చెన్నై క్విక్‌గన్, గుజరాత్ తదితర జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. తాజాగా ఆడుదాం ఆంధ్ర పోటీల్లో జె.పంగలూరు సచివాలయం నుంచి ప్రాతినిధ్యం వహించి బాపట్ల జట్టును స్టేట్ చాంపియన్‌గా నిలపడంలో కీలకపాత్ర పోషించి ఖోఖో పురుషుల విభాగంలో బెస్ట్ ప్లేయర్‌గా ఎంపికయ్యాడు.

కె.గాయత్రి.. బ్యాటింగ్‌లో మేటి



పులివెందుల పట్టణంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ట్రిపుల్‌ఈ నాల్గవ సంవత్సరం చదువుతున్న కె.గాయత్రి మహిళల క్రికెట్‌లో చక్కటి ప్రతిభ కనబరిచి టాలెంట్ హంట్‌లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధుల చూపును ఆకర్షించింది. వైఎస్‌ఆర్ కడప జిల్లా పులివెందుల సచివాలయం జట్టు నుంచి పాల్గొన్న కడప మహిళల జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన గాయత్రి బ్యాటింగ్‌లో చక్కటి ప్రతిభ కనబరచడంతో టాలెంట్ హంట్‌కు ఎంపికైంది. కాగా ఈమె స్వస్థలం పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పూర్‌గా తల్లిదండ్రులు అన్నపూర్ణ, ఈశ్వరరావు విశాఖపట్నంలో స్థిరపడ్డారు.

సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

ఆడుదాం ఆంధ్ర రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్లు, క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు.

- బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో కడప కాగితాలపేట సచివాలయం నుంచి ప్రాతినిధ్యం వహించిన అబ్దుల్–ఖాజా జోడి రెండో రన్నర్‌ప్‌గా నిలిచాయి.
- బ్యాడ్మింటన్ మహిళల విభాగంలో కడప శంకరాపురం–4 సచివాలయం నుంచి ప్రాతినిధ్యం వహించిన కె.వెన్నెల–శ్రీలత జోడి రన్నరప్‌గా నిలిచారు.
- వాలీబాల్ పురుషుల విభాగంలో అన్నమయ్య జిల్లా కూచివారిపల్లె–1 సచివాలయం నుంచి ప్రాతినిధ్యం వహించిన వాలీబాల్ జట్టు రెండో రన్నరప్‌గా నిలిచాయి.

ఆసుపత్రిలో యువకుడి వీరంగం


తాను చనిపోతానంటూ ఏడుస్తున్న శంకర

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో యువకుడు వీరంగం సృష్టించిన సంఘటన మంగళవారం జరిగింది. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం కొత్తపల్లికి చెందిన గంగులమ్మ అమర్నాథ దంపతుల కుమారుడు శంకర(20) ఇంట్లో తల్లిదండ్రులు మందలించడంతో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితున్ని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి వచ్చిన వెంటనే యువకుడు తాను చచ్చిపోతాను అంటూ బెదిరిస్తూ చేతికి అందిన ఇంజక్షన్ తీసుకొని మెడపై పొడుచుకునేందుకు ప్రయత్నించాడు. వెంటనే అక్కడే ఉన్న డ్యూటీ డాక్టర్, వైద్య సిబ్బంది అప్రమత్తమై యువకుడ్ని అడ్డుకున్నారు. చేతిలోని సిరంజిని తీసుకుని విసిరివేశారు. అనంతరం బంధువుల సాయంతో క్యాజువాలిటీలో చికిత్సలు అందించారు. చాలాసేపటి వరకు బంధువులతో తాను చనిపోతాను అంటూ వాగ్వివాదం చేస్తూ నానా హంగామా చేశాడు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ హోంగార్డు దుర్మరణం


మృతి చెందిన కృష్ణయ్య

మదనపల్లె : ద్విచక్ర వాహనాన్ని ఐచర్ వాహనం ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ హోంగార్డ్ మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నెకు చెందిన వెంకటప్ప గంగులమ్మ కుమారుడు ఉప్పుతోళ్ల కృష్ణయ్య (66) మంగళవారం వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో మదనపల్లె పట్టణానికి వచ్చాడు. తిరిగి స్వగ్రామం వలసపల్లెకు వెళుతుండగా, బైపాస్ రోడ్డు వై.జంక్షన్ వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన ఐచర్ వాహనం కృష్ణయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కింద పడిన కృష్ణయ్య తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి మార్చురీ గదికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు కృష్ణయ్య పోలీస్ శాఖలో హోంగార్డుగా పని చేశాడు. 2018లో మదనపల్లె ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ కార్యాలయంలో హోంగార్డుగా పని చేస్తూ రిటైర్ అయ్యారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు సుమలత, స్నేహలత ఉన్నారు. ఆరు నెలల క్రితం భార్య అనారోగ్య కారణాలతో మృతి చెందింది. గతంలోనే పెద్ద కుమార్తె సుమలత సైతం మృతి చెందింది. రెండు రోజుల క్రితమే చిన్న కుమార్తె స్నేహలత వివాహం జరిపించాడు. ఇంతలోనే మృత్యు ఒడికి చేరడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి


మృతి చెందిన హరేన్ సాకేత్

మదనపల్లె : చిన్నారి ప్రమాదవశాత్తు నీటి తొట్టెలో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. చిత్తూరు జిల్లా కల్లూరుకు చెందిన నాగరాజు భార్య మయూరి ఏడాది క్రితం మదనపల్లి మండలం చిప్పిలిలో ఉన్న శివశంకర్‌రెడ్డి వద్దకు వచ్చి సహజీవనం చేస్తోంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడిని తల్లిదండ్రుల వద్ద వదిలిపెట్టింది. రెండో కుమారుడు హరన్ సాకేత్ (3) తన వద్ద ఉంచుకొని పోషిస్తుంది. మయూరి స్థానికంగా ఉన్న ఆహార సంస్థ విష్ణ కంపెనీలో ప్యాకేజీ సెక్షన్‌లో పని చేస్తుంది. ఆమెతోపాటు శివశంకర్ రెడ్డి సైతం అక్కడే పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఆమె పనికి వెళ్లగా శివశంకర్ రెడ్డి ఇంటి వద్ద ఉన్నాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అతని కోసం స్నేహితుడు రావడంతో, తన వద్దనున్న సెల్ చిన్నారి సాకేత్‌కు ఇచ్చి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సమయానికి ఇంటి సమీపంలోని నీటి తొట్టెలో సాకేత్ పడి ఉండటాన్ని గమనించాడు. వెంటనే బయటకు తీయగా కొన ఊపిరితో ఉండడంతో హుటాహుటిన స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించాడు. మయూరికి సమాచారం అందించాడు. ఆసుపత్రిలో బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిబ్బంది మార్చురీగదికి తరలించారు. ఆసుపత్రికి చేరుకున్న బాలుడి తల్లి మయూరి కన్నీటి పర్యంతం అయింది. సమాచారం అందుకున్న తాలూకా ఎస్సై రవికుమార్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మయూరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూసార పరీక్షలు లాభదాయకం


మాట్లాడుతున్న ఆత్మ పీడీ విజయలక్ష్మి

రాజంపేట రూరల్ : సాగు పొలాలలో భూసార పరీక్షలు నిర్వహించడం రైతులకు ఎంతో లాభదాయకమని ఆత్మ పీడీ విజయలక్ష్మి తెలిపారు. మండల పరిధి ఆకేపాడు పంచాయతీలోని నారంరాజుపల్లిలో గల జవహర్ నవోదయ పాఠశాలలో మంగళవారం ఆత్మ ఆధ్వర్యంలో భుసార పరీక్షల పైన విద్యార్థులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన పీడీ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు చంద్రనాయక్ విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భూసార పరీక్షలు నిర్వచహించడం వల్ల భూమిలోని శక్తిని అంచనా వేయవచ్చని తెలియజేశారు. అందువలన ఎటువంటి రసాయనాలు వాడితే పైరు ఏపుగా వచ్చి మంచి దిగుబడిని ఇస్తుందో తెలుసుకోవచ్చన్నారు. భూమిని బట్టిని రసాయనాలు వాడటం వలన రైతుకు అధిక లాభాలు వస్తాయని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు భూసార పరీక్షలపై నేర్చుకున్న విషయాలను వేదికపై నుంచి వివరించారు. వారిలో ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే ఊటుకూరు శాస్త్రవేత్త సాయి మహేశ్వరి, డీపీడీ పద్మావతీ, కడప, రాజంపేట ఏడీఏలు రాధాదేవి, జీ రమేష్‌బాబు, ఆత్మ బీటీఎం సుబ్రమణ్యం, ఏఓ సాగరిక, వైస్ ప్రిన్సిపల్ గాయత్రి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మదనపల్లె : జిల్లా ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి(55) మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. వాల్మీకిపురం సమీపంలో సోమవారం రాత్రి సుమారు 55 ఏళ్ల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మద్యం మత్తులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్‌లో వాల్మీకిపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా, అక్కడ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి బాధితుడిని తరలించారు. ఆసుపత్రికి చేరుకునే సమయానికి అతని పరిస్థితి విషమంగా ఉండడంతో ఐసీయూ విభాగంలో ఉంచి స్థానిక వైద్యులు చికిత్సలు అందించారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీ గదికి తరలించారు. మృతుడు నలుపు రంగు ప్యాంటు, అడ్డచారల ఆకుపచ్చని టీ షర్టు దానిపై క్రీం కలర్ స్వెటర్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని గుర్తించగలిగిన వారు మదనపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

చెరువు ముందరపల్లెలో పశువులకు వ్యాక్సినేషన్

సాక్షి ఎఫెక్ట్..


పశువులకు పిడుదులు సోకకుండా మందులు స్ప్రే చేస్తున్న వెటర్నరీ సిబ్బంది

నిమ్మనపల్లె : మండలంలోని అగ్రహారం పంచాయతీ చెరువు ముందరపల్లె గ్రామం (నల్లగొండ)లో పశువైద్యాధికారి సాధు సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం వ్యాక్సినేషన్, డీ వార్మింగ్ నిర్వహించారు. అంతు చిక్కని వ్యాధితో ఆవులు మృతి అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో స్పందించిన పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వెటర్నరీ అధికారి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గ్రామంలో చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి, ఆవులు, దూడలలో పిడుదులు వ్యాప్తి చెందకుండా ఈగల మందును స్ప్రే చేశారు. పశువులకు ముందు జాగ్రత్తగా వ్యాక్సినేషన్ చేశారు. బుధవారం గ్రామంలో వ్యాక్సినేషన్ డి వార్మింగ్ కార్యక్రమాలు కొనసాగుతాయని పశువైద్యాధికారి తెలిపారు. స్థానిక రైతులు పశువులకు ఆహారంగా వేస్తున్న ఎండు గడ్డి, ఫీడ్ వాడకంపై అవగాహన కల్పించామన్నారు. గ్రామంలోని పశువులను పరిశీలించి పరీక్షించడం జరిగిందన్నారు. గురువారం గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపు రేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

కార్పొరేట్ హంగులతో పాఠశాల



గతంలో మా పాఠశాలలో తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మౌలిక సదుపాయాలు లేవు. ప్రస్తుతం నాడు–నేడుతో అదనపు తరగతి గదులు నిర్మించారు. పాఠశాలను కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్దారు. తరగతి గదిలో బెంచీలు, ఫ్యాన్‌లు ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఐఎఫ్‌పి ప్యానెల్స్ ఏర్పాటు చేయడంతో డిజిటల్ బోధన జరుగుతోంది. ఉర్దూ పాఠశాల కావడంతో విద్యార్థులందరికీ సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించారు. అన్ని సౌకర్యాలు ఉండటంతో పాఠశాలలో చేరే వారి సంఖ్య కూడా పెరిగింది.

– షాజహాన్, హెచ్‌ఎం, మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాల, మదనపల్లె

రూపాయి ఖర్చు లేకుండానే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకునే వారం. అయినా సకాలంలో వచ్చేవి కావు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా స్థానిక సచివాలయంలోనే అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని వలంటీర్ మహేశ్వరి చెప్పడంతో నేను దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు వచ్చాయని, సచివాలయం వద్దకు వచ్చి తీసుకెళ్లాలని వలంటీర్ చెప్పడంతో మేము వెళ్ళి ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నాము. గత ప్రభుత్వ హయాంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఉండేది. జగనన్న ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే పథకాలు వస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నాం.

– మైలుసుభద్ర, గోపవరం, గోపవరం మండలం

ఇంటి నిర్మాణం పూర్తి



సొంత ఇల్లు నిర్మించుకోవాలని ఎన్నో సార్లు దరఖాస్తు చేసుకున్నాను. కార్యాలయాల చుట్టూ తిరిగాను. అయినా ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇల్లు కావాలని వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. ఇల్లు మంజూరైందని చెప్పడంతో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసుకున్నాను. బిల్లులు కూడా సకాలంలో రావడంతో నిర్మాణాన్ని పూర్తి చేసుకుని ఇంటిలో చేరాం.

– కాకనూరు లక్ష్మీదేవి, గాదెగూడూరు గ్రామం, రాజుపాళెం మండలం

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన మనోళ్లు


సాయితేజ్‌రెడ్డి


ముక్కర సాత్విక్

సిద్దవటం : జిల్లాలోని కొందరు విద్యార్థులు మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటారు. సిద్దవటం మండలంలోని మాధవరం–1కు చెందిన కుడుముల రామ్ ధ్రువ సాయితేజ్‌రెడ్డి, వంతాటిపల్లికి చెందిన ముక్కర సాత్విక్ అనే విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ కనపరిచారు. మాధవరం–1లోని హ్యాపీకిడ్స్ హైస్కూల్ కరస్పాండెంటు కుడుముల అనిల్‌కుమార్‌రెడ్డి కుమారుడు రామ్‌ధ్రువ సాయితేజ్‌రెడ్డి జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.38 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. సిద్దవటంలో పదో తరగతి చదివిన ఈ విద్యార్థికి గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అలాగే వంతాటిపల్లికి చెందిన ముక్కర వెంకటసుబ్బారెడ్డి కుమారుడు ముక్కర సాత్విక్ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 96.61 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఈ విద్యార్థి సిద్దవటంలో 10వ తరగతి చదివాడు. ఈ అబ్బాయికి ఉపాధ్యాయులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

గురిజాల విద్యార్థి..


శ్యాంసుందర్‌రెడ్డి

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన భూమిరెడ్డి నీలకంఠారెడ్డి కుమారుడు గగన్ శ్యాంసుందర్‌రెడ్డి 99.567 శాతంతో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తమ కుమారుడి ప్రతిభకు కృషి చేసిన ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆ విద్యార్థికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. మరింత కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదుగుతానని ఆ విద్యార్థి తెలిపారు.

ఎస్‌డీఆర్ విద్యార్థుల సత్తా


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డీఎస్పీ కె.రవీంద్రారెడ్డి

నంద్యాల (న్యూటౌన్) : జేఈఈ మెయిన్స్ 2024 పరీక్షల్లో ఎస్‌డీఆర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ మేరకు ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం డీఎస్పీ కె.రవీంద్రారెడ్డి, ఎస్‌డీఆర్ కళాశాల చైర్మన్ వెంకటరామిరెడ్డి తదితరులు అభినందించారు. జేఈఈ మెయిన్ ఫలితాల్లో మోహన్ కృష్ణ 99.95 శాతం సాధించి ప్రతిభ చూపారు. అలాగే జితేంద్ర 99.36 శాతం, కె.నాగపవన్‌కుమార్ 97.63, వి.కార్తీకేయరెడ్డి 96.78, 90 శాతంతో మొత్తం 18 మంది అద్భుతమైన ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. ఇందుకు కృషి చేసిన విద్యార్థులను, అధ్యాపకులను ఎస్‌డీఆర్ కళాశాల చైర్మన్ కొండారెడ్డి అభినందించారు. అత్యాధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో సీఐ మంజునాథరెడ్డి, డాక్టర్ గెలివి సహదేవుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● 'భీరం' కళాశాల విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో భీరం సుబ్బారెడ్డి

ఖాజీపేట : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో భీరం కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. 99 శాతానికి పైగా నలుగురు, 98 శాతానికి పైగా ఆరుగురు విద్యార్థులు ఫలితాలు సాధించారు. అందులో వి.సాత్విక 99.62, పి.లక్ష్మిగణేష్ 99.13, జి. నాగదత్తేశ్వరకుమార్ 99.32, పి.కేదార్నాథ్ 99.13, సి.విష్ణువర్ధన్ 98.40, పి.లక్ష్మిభావన 98, పి.ప్రియదీపిక 97.01, ఎస్.అఖిల్‌కుమార్ 97.01, హరిధనుష్ 95.61, సుమంత్‌రెడ్డి 95.34 సాయితేజారెడ్డి 95.12 శాతం ఫలితాలు తెచ్చుకున్నారు.

ఉత్తమ విద్యతోనే ఉత్తమ ఫలితాలు

విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడంతోనే తమ సంస్థ ఉత్తమ ఫలితాలు సాధించిందని భీరం కళాశాల కరస్పాండెంట్ సబ్బారెడ్డి అన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని నిరంతరం పెంపొందించడంలో ఉపాధ్యాయులు ఎంతో కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. అత్యుత్తమ విద్యా ప్రమాణాలు పాటిస్తూ నిరంతర కృషి కారణంగా నేడు ఉత్తమ ఫలితాలు వచ్చాయని అన్నారు. కడప టౌన్‌లో కూడా బ్రాంచ్‌ను మొదలు పెట్టామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.